# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 27, డిసెంబర్ 2025


## బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



★ జిల్లా అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్

★ కాగజ్‌నగర్‌లోని నేషనల్ జిమ్, బాక్సింగ్ క్లబ్‌ల సందర్శన

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శుక్రవారం బాక్సింగ్ డే సందర్భంగా కాగజ్‌నగర్‌లోని నేషనల్ ఫిట్‌నెస్ జిమ్, శివ బాక్సింగ్ క్లబ్‌లను సందర్శించారు. యువతకు ఉచిత బాక్సింగ్ శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న కానిస్టేబుల్ నివాస్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. ముందుగా అడిషనల్ ఎస్పీ హనుమాన్ చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్‌లో శిక్షణ పొందుతున్న బాక్సర్లను పరిచయం చేసుకుని, బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ యువత బాక్సింగ్ వంటి క్రీడలను నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం కూడా పెరుగుతుందని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, యువత తమ ప్రతిభను క్రీడారంగంలో ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ తనకు ఇష్టమైన బాక్సింగ్ క్రీడను యువతకు ఉచితంగా శిక్షన ఇస్తున్న నివాస్ ఎంతో మందికి ఆదర్శమని మిగతా 2లో..

## రోడ్లపైనే వ్యాపారం..



## పట్టింపులేని అధికారులు..!

**సారంగాపూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

మండలంలోని స్వర్ణ గ్రామంలో రోడ్డుపైన ఆక్రమించుకొని చికెన్ సెంటర్‌ను నడుపుతున్నారు. అతను ఇంత క్రితం స్వర్ణ సర్పంచ్‌గాను, ప్రస్తుతం సారంగాపూర్ మార్కెట్ చైర్మన్‌గాను విధులు నిర్వహిస్తున్నారు. అతని సోదరుడు ప్రభుత్వ ఎలక్ట్రిసిటీ బోర్డ్ పోల్ ఆక్రమించి రోడ్ నిబంధనలను వ్యతిరేకించి రోడ్డుపైకి వ్యాపార చేస్తున్నారు. లింగాపూర్ రోడ్డు నుండి స్వర్ణ బస్టాండ్ వరకు నిబంధన పాటించకుండా రోడ్డులపై వ్యాపారం చేస్తున్నారు. ఎందుకంటే తను ప్రస్తుత అధికార పార్టీలో ఉన్నానని అంతేకాకుండా ప్రముఖుల అండదండలు ఉన్నాయని, నేను చేసింది ఎవరు పట్టించుకోరని, స్థానికులు అండదడాలు ఉన్నాయని కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గ్రామ ప్రజలు కూడా మేమేం చేస్తాం అధికారులకే పట్టింపు లేదు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. మాకెందుకు వారు స్థానిక లీడర్లు ఎందుకు జోక్యం చేసుకుంటామని పట్టింపు లేకపోవడం జరిగింది. స్థానిక పంచాయితీ కార్యదర్శి ఎంపీడీవో, ఎమ్మార్వోలు వీరికి పట్టింప్పు లేదు. మాకెందుకులే అది లీడర్ల వ్యవహారం అని వదిలిపెట్టారు. అధికారులు, రాజకీయ నాయకులతో, మైనార్టీ వర్గంతో మాకెందుకని పట్టించుకోక ఉన్నారు. అదే వేరే సామాజికవర్గం ఐతే రేపటికి, రేపు తొలగించేవారు అలాంటప్పుడు సామాన్యులమైన మేమేం చేస్తామని ప్రజలు అంటున్నారు.

పెంచికల్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో

## అవినీతి బాగోతం..!




2లో..

★ కంప్యూటర్ ఆపరేటర్ అక్రమాలు...

★ పేద రైతుల నుంచి డబ్బులు వసూలు... పని శూన్యం

★ స్థానిక పోలీస్ స్టేషన్ లో రైతుల ఫిర్యాదు

– పెంచికల్‌పేట్, డిసెంబర్ 26, ప్రభాతవార్త

## ఇచ్చోడ పిహెచ్‌సీ సెంటర్‌ను సిహెచ్‌సీ చేయాలి

✣ బోథ్ ఆసుపత్రిలో చిల్డ్రన్స్, గైనకాలజిస్ట్ డాక్టర్లను నియమించాలి

✣ నియోజకవర్గంలోని 10 మండలాలకు అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలి

✣ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

✣ రిమ్స్ క్రిటికల్ కేర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**నేరడిగొండ, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

ఇచ్చోడ పిహెచ్‌సి సెంటర్‌ను సిహెచ్‌సి చేయాలని, బోథ్ ఆసుపత్రిలో చిల్డ్రన్స్, గైనకాలజిస్ట్ డాక్టర్లను నియమించాలని, నియోజకవర్గంలోని 10 మండలాలకు అంబులెన్స్‌లను ఏర్పాటు మిగతా 2లో..

## ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

☆ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

☆ పాత్రికేయుల రిలే నిరాహార దీక్షకు ఏలేటి సంఘీభావం

– నిర్మల్‌రూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త




2లో..

## ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

నిర్మల్‌రూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త

అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తానని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయన జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని అన్నారు. నిర్మల్‌లో వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ధీ1 పట్టాల పేరుతో అన్యాక్రాంతం చేశారని దీనిపై పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రితో మాట్లాడి ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. లేదంటే రాబోయే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలో పాత్రికేయులకు అండగా నిలిచి వారి న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, ముత్యం రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్ (చందు), పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు ఒడిసెల అర్జున్, మాజీ కౌన్సిలర్లు భూపతి రెడ్డి, నరేందర్, నవీన్, పట్టణ నాయకులు అల్లం భాస్కర్, జుట్టు దినేష్, భరత్, విజయ్, బంటి తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చోడ పిహెచ్‌సి సెంటర్‌ను సిహెచ్‌సి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతోకలిసి ప్రారంభించిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రిటికల్ కేర్ నిర్మాణం కొరకు రూ. 17 కోట్లు మంజూరు అయ్యాయని అన్నారు. విద్య వైద్యం కోసం కేసీఆర్ పెద్దపీట వేశారని అన్నారు. నియోజకవర్గ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్తూ.. ఇచ్చోడ పిహెచ్‌సిని సెంటర్‌ను సిహెచ్‌సిగా మార్చాలని, బోథ్ ఆసుపత్రిలో చిల్డ్రన్ మరియు గైనకాలజిస్ట్ డాక్టర్లను తక్షణమే నియమించాలని అన్నారు, సిరికొండ ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయిన డాక్టర్ల నియామకం జరగలేదని తక్షణమే డాక్టర్ల నియామకం చేపట్టాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలోని 10 మండల కేంద్రాల్లో అంబులెన్స్‌లా నియామకం చేపట్టాలని, ఇచ్చోడ మండల కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

- అబ్దుల్ అజీజ్




రామకృష్ణాపూర్, ప్రభాతవార్త

బాంగ్లాదేశ్‌లో హిందువుల పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని తవక్కల్ పాఠశాలల అధినేత, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, రామకృష్ణాపూర్ ముస్లిం మైనారిటీ ఈద్గా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. శుక్రవారం రామకృష్ణాపూర్ బిలాల్ మస్జిద్ ఆవరణలో నూతన ఇస్లామిక్ తెలుగు క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రామకృష్ణాపూర్ బిలాల్ మజిద్ మస్జిద్ సదర్ ఆరిఫ్ అధ్యక్షతన 2026 నూతన సంవత్సర ఇస్లామిక్ శాంతి మార్గం క్యాలెండర్‌ని పట్టణ ముస్లిం మత పెద్దలు, అక్బర్ అలీ, ఖాజా షరీఫ్, నజీర్, ఖాజా, ఇమ్రాన్, అన్వర్, ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను విడుదల చేసి ముస్లిం సోదరులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన ఇస్లామిక్ తెలుగులో ప్రచురించిన విధంగా ఖురాన్, హదీసుల ప్రకారం ముస్లిం సోదరులు తమ జీవితాన్ని గడపాలన్నారు. బిలాల్ మస్జీద్ సదర్ ఆరిఫ్, రామకృష్ణపూర్ ముస్లిం మైనారిటీ ఈద్గా కమిటీ సభ్యుడు యాకుబ్ అలీ, ఖాజాషరీఫ్, నజీరోద్దీన్ అంకుష్,అఫ్జల్, ఇశ్రాత్,ఇమ్రాన్, అన్వర్, మోహిత్, ఖాజా, తాజ్, షబ్బీర్ అలీ,తహర్, పాషా, ఇమామ్ పాల్గొన్నారు.

## అమరవీరుడు ఉద్ధం సింగ్ త్యాగానికి నివాళులు

- ఉద్ధం సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించిన రాజేష్-రాణి పిహెప్వాల్



మందమర్రి, ప్రభాతవార్త


ఉద్ధం సింగ్ జయంతి సందర్భంగా రాజేష్ పిహెప్వాల్-రాణి పిహెప్వాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుడు ఉద్ధం సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో అమర వీరుడు ఉద్ధం సింగ్ త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. జలియన్ వాలాబాగ్ మారణకాండకు ప్రతీకారంగా, వేలాది నిరపరాధుల హత్యకు కారణమైన బ్రిటిష్ అధికారి మైకేల్ ఓడ్వైర్‌ను హతమార్చి దేశ గౌరవాన్ని నిలబెట్టిన మహావీరుడు ఉద్ధం సింగ్ అని కొనియాడారు. 1919 ఏప్రిల్ 13న అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో నిరాయుధ ప్రజలపై జనరల్ డయ్యర్ ఆదేశాలతో జరిగిన కాల్పుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఆ అమానుష ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఉద్ధం సింగ్, ప్రతీకార దీక్షతో సంవత్సరాల పాటు ఎదురుచూసి, 1940 మార్చి 13న లండన్‌లోని క్యాక్స్టన్ హాల్‌లో డయ్యర్‌ను హతమార్చి బ్రిటిష్ సామ్రాజ్యానికి సవాల్ విసిరారని తెలిపారు. ఈ కార్యక్రమంలోసింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. పురుషోత్తం, ఉపాధ్యాయులు ఎం. జీవన్, ఎ. తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.


## పెంచికల్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో

# అవినీతి బాగోతం..!

పెంచికల్‌పేట్, డిసెంబర్ 26, ప్రభాతవార్త

పెంచికల్ పేట్ మండల తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డగా మారిందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. బాధిత రైతులు స్థానిక పోలీస్ స్టేషన్ లో చేసిన ఫిర్యాదు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మండలంలోని పలువురు అమాయక పేద రైతుల నుంచి రెవెన్యూ అధికారులు కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కొంతమంది పేద, అమాయక రైతుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి భూ సంబంధిత పనులు చేసి పెడతామని నమ్మించి డబ్బులు తీసుకుని పనులు చేయకుండా మోసం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. భూమి సమస్యలు భూభారతి, పట్టాదార్ పాస్ బుక్స్, రెవెన్యూ సర్టిఫికెట్లు, రేషన్ కార్డుల జారీ పేరుతో రైతుల నుంచి లక్షల రూపాయలు తీసుకుని నెలలు గడిచిన పనులు పూర్తి కాలేదని వాపోతున్నారు. అడిగితే రేపు ఎల్లుండి అంటూ తిప్పుకుంటున్నారని, కొందరు రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామనే వాదనలు వినిపిస్తున్నాయి.





సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫిర్యాదు పత్రం

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...

ఈ వ్యవహారానికి పాల్పడిన కంప్యూటర్ ఆపరేటర్లు, అధికారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులను పూర్తిగా తిరిగి ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతు మోసపోయిన బాధిత రైతులు 30 మంది స్థానిక పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

### రైతుల హెచ్చరిక...

భవిష్యత్తులో మిగతా రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఏ పని పేరుతోనైనా అధికారులు డబ్బులు అడిగితే వెంటనే తిరస్కరించి సంబంధిత ఉన్నతాధికారులను, ఏసిబి ని సంప్రదించాలని బాధిత రైతులు తెలుపుతున్నారు. తాసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ఇలాంటి అఘాయిత్యాలపై ఉన్నత అధికారులు కళ్ళు తెరవకపోతే ఉద్యమాలకు సైతం సిద్ధమని రైతులు హెచ్చరిస్తున్నారు.

### విషయాన్ని అడిషనల్ కలెక్టర్‌కి తెలియజేశాం

- తిరుపతి, తహసీల్దార్, పెంచికల్ పేట్

తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై తహసీల్దార్ తిరుపతిని ఫోన్ లో సంప్రదించగా డబ్బులు తీసుకున్న ఆపరేటర్ బదిలీ అయ్యారని కొంతమంది రైతులు విషయాన్ని మాకు తెలియప రచగా జిల్లా అడిషనల్ కలెక్టర్ కు తెలియపరిచామని అందుకు మేము ఏం చేయలేమాని తెలిపారు.

## అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీని తక్షణమే నిలుపుదల చేయాలి

- ఆర్.కె న్యూటెక్ గనిపై సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ
- డిప్యూటీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన కార్మికులు



నస్పూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె న్యూటెక్ గని కార్మికులపై అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ పేరిట యాజమాన్యం అదనపు భారం మోపడం తగదని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గతంలో కంపెనీ అవసరాల నిమిత్తం సర్ఫేస్ లో పనిచేసిన కార్మికులకు చెల్లించిన అండర్ గ్రౌండ్ అలవెన్స్ ఇప్పుడు తిరిగి వసూలు చేస్తామంటూ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం గనిపై సంతకాల సేకరణ చేపట్టారు. అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఆరగే సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కమిటీ సభ్యులు కస్తూరి చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. కంపెనీ అవసరాల కోసమే కార్మికులు గతంలో సర్ఫేస్ లో విధులు నిర్వహించారని, అప్పట్లో ఆ భత్యాన్ని పట్టించుకోకుండా, ఇన్ని నెలల తర్వాత ఇప్పుడు రికవరీ చేస్తామని లెటర్లు ఇవ్వడం కార్మికులను ఇబ్బందులకు గురిచేయడమేనని మండిపడ్డారు. ఈ సమస్యపై గతంలోనే మాట్లాడామని చెబుతున్న గుర్తింపు సంఘం, క్షేత్రస్థాయిలో రికవరీ లెటర్లు వస్తున్నా అడ్డుకోవడంలో విఫలమైందని చంద్రశేఖర్ విమర్శించారు. పాత రికవరీల పేరుతో కార్మికుల వేతనాల్లో కోత విధించడం సరైనది కాదని, యాజమాన్యం వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గని షిఫ్ట్ ఇంచార్జ్, డిప్యూటీ మేనేజర్ సాత్విక్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీకాంత్, రాజయ్య, రమేష్, ప్రతాప్, లింగమూర్తి, తిరుపతి, రవి రాజేష్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఆత్మస్థైర్యం పెంపొందుతుంది

(మొదటిపేజీ తరువాయి)

ప్రశంసించారు. యువతను రాష్ట్ర, జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు సిద్ధం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు, కోచ్‌లు, బాక్సర్లు, రామకాంత్ యాదవ్ (మాజీ సర్వీస్‌మాన్, సీనియర్ నేషనల్ బాక్సర్), జాకీర్, శ్రవణ్ గౌడ్ (నేషనల్ ఫిట్‌నెస్ జిమ్ ట్రైనర్), వినయ్ యాదవ్ (కోచ్) తదితరులు పాల్గొన్నారు.

## మోదెల లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరుపై కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం

లక్సెట్టిపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త

ఎన్నికల హామీ మేరకు మండలంలోని మోదెల లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పట్టణంలో ఉత్కూర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావులకు వారు కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో పది సంవత్సరాలుగా ఎన్నో సమస్యలు ఉన్న, సమస్యలను పరిష్కరించకుండా రైతులకు ఎంతో నష్టం చేశారని, ఏమాత్రం రైతు సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా ప్రేమ్ సాగర్ రావు గెలుపొందిన వెంటనే రైతు సమస్యలను విన్నవించగా ప్రత్యేక చొరవ తీసుకుని 74 కోట్లతో గూడెం, కన్నెపల్లి, మోదెల పరిసర ప్రాంత రైతుల కోసం నీరు అందించడానికి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మంజూరు చేయించారు. కేవలం రెండు సంవత్సరాల లోనే ఏ నియోజకవర్గంలో లేని అభివృద్ధిని మంచిర్యాల నియోజకవర్గంలో చేసి చూపించారు అనడానికి ఇదే నిదర్శనం అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు.. ఇంతటి చొరవ చూపి లిఫ్ట్ ఇరిగేషన్‌ని మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు రైతులు ఎంతో సంతోషంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎండి. ఆరిఫ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, మాజీ కోఆప్షన్ సభ్యులు షాహిద్ అలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్, కన్నెపల్లి సర్పంచ్ చుంచు నగేష్, మండల సర్పంచులు సత్తయ్య, లింగంపల్లి వెంకటేష్, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచులను ప్రలోభాలకు గురి చేస్తే సహించబోం

✪ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ✪ సొంతగూటికి చేరిన గంగాధర్

**నేరడిగొండ, డిసెంబర్ 25, ప్రభాతవార్త:**

అమాయకమైన సర్పంచులను ప్రలోభాలకు గురి చేస్తే సహించబోమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హెచ్చరించారు. శుక్రవారం నెరడిగొండ మండలం లఖంపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సెడ్మకి సుజాత భర్త గాంగధర్, ఉపసర్పంచ్ రేంగే పూజ సంతగూటికి బిఆర్ఎస్ చేరారు. వారికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అమాయకమైన బీఆర్ఎస్ సర్పంచులను కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు గురి చేస్తుందని, దమ్ముంటే కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను గెలిపించుకునే సత్తా ఉండాలి కానీ, ఇలా ఇతర సర్పంచులను చేర్చుకోవడం సిగ్గు చేటని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ ఉన్నారు.





భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ఆనందరావు

## గణేష్ మండప నిర్మాణానికి భూమి పూజ

**కెరమెరి డిసెంబర్ 26 ప్రభాతవార్త :**

మండల కేంద్రం1వ వార్డు బెస్తవాడలో తమకు గణేష్ మండపం కొరకు షెడ్డు కావాలని కాలనీవాసులు కోరగా గెలిచిన తర్వాత తప్పకుండా నిర్మించి ఇస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం నూతన షెడ్డు నిర్మాణానికి సర్పంచ్ పెందోర్ ఆనందరావు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వికార్ హైమద్ దేశముఖ్ , సెందె తిరుపతి, సాదు పటేల్, కాలనీ వాసులు శ్రవణ్, నాను, భీంరావు తదితరులు ఉన్నారు.



నట్టల నివారణ మందులు వేస్తున్న డాక్టర్ రాకేష్, సర్పంచ్ ఉస్మాన్

## నట్టల నివారణ మందు పంపిణీ

**పెంచికల్ పేట్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

పెంచికల్ పేట్ మండలంలోని పెంచికల్ పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి గ్రామాలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని శుక్రవారం మండల పశువైద్యధికారి డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. నట్టల వల్ల గొర్రెలు, మేకలలో కలిగే వ్యాధులు, నష్టాలపై పశుపోషకులకు అవగహన కల్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పశువైద్య, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 31 వరకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించబడుతుందని గొర్రెలు, మేకల యజమానులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉస్మాన్, రాంచందర్, రవి, ఉప సర్పంచ్ శేఖర్, పశువైద్య సిబ్బంది ఆనందరావు, శివ, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

**వాంకిడి, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరి చేసి శుక్రవారం బాధితుడికి వాంకిడి ఎస్ఐ మహేందర్ అప్పగించారు. వాంకిడి మండలం జంబుల్దారికు చెందిన కలవంతరావు రెడ్మీ మొబైల్ వాంకిడి మార్కెట్ ఏరియాలో పోవడం వల్ల వాంకిడి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయగా పోలీసు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడి కి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మహేందర్ మాట్లాడుతూ మొబైల్ పోయిన లేదా దొంగిలించబడిన ప్రతి ఒక్కరూ కూడా త్వరగా స్పందించి సి ఇ ఐ ఆర్ పోర్టల్ నందు ఫిర్యాదు నమోదు చేస్తే మొబైల్ ట్రేస్ అవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది తెలియజేశారు. ఈ మొబైల్స్ ట్రేస్ చేయుటలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీమ్ ఎస్సై ప్రత్యేకంగా అభినందించారు.



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మహేందర్



## ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**నిర్మల్ రూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్ కాలనీలో రూ. 30 లక్షలతో శ్రీ కార్య సిద్ధి హనుమాన్ ఆలయ ప్రహారీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ముందుగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, ఆడెపు సుధాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, తాజా మాజీ కౌన్సిలర్లు నవీన్, నరేందర్, భూపతి రెడ్డి, స్థానిక నాయకులు గంజి రాజు, స్వప్నిక్, పట్టణ బీజేపీ నాయకులు అల్లం భాస్కర్, శ్రీరామోజు నరేష్, వోడ్నాల రాజు, భరత్, జింక సూరి, నర్సయ్య, ఉత్తూరు పోషెట్టి, మురళి, కన్నా, సతీష్, నంద కిషోర్, నూకల సంతోష్, భీమ్ రావ్, బంటి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న సర్పంచ్

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**బెజ్జూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని సులుగుపల్లి గ్రామస్తుడు తలండి భుజంగారావు గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను సర్పంచ్ సోయం చిన్నయ్య పరామర్శించి మృతుని భార్య తలండి బయ్యక్కకు రూ.10,016/ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తనకు నేరుగా తెలియజేయాలని సర్పంచ్ తెలిపారు. సమస్యలు తీర్చడానికి తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ విఎస్ఎస్ అధ్యక్షుడు సిడం ఫకీర్, గ్రామ పటేల్ ఆత్రం రామయ్య, మాజీ ఉపసర్పంచ్ తలండి మల్లేష్, కామెర విలాష్, కర్పేత కళ్యాణ్, సడ్మేక శివరాం, వార్డు సభ్యులు గేడం నరేష్, మహిళా నాయకురాలు జ్యోతి, విద్యాసాగర్, ధర్మయ్య పాల్గొన్నారు.

## వార్షిక లక్ష్యాలను అధిగమించాలి

**తాండూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియా కు నిర్దేశించుకున్న వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని జీఎంప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ (పి పి) దేవేందర్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి తో కలిసి కైరిగూడ ఉపరితల గనిని ఆయన సందర్శించారు. వ్యూ పాయింట్ నుండి పని స్థలాలు ఆయన పరిశీలించారు. ఉత్పత్తి సాధన, రవాణాకు రానున్న మూడు నెలలు ఎంతో కీలకమని ఏరియా అధికారులకు సూచించారు. ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత పై వివరాలు తెలుకున్నారు. గోలేటి ఉపరితల గని పనుల ప్రగతి పై చర్చించారు. కార్యక్రమంలో కైరిగూడ ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న,మేనేజర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కైరిగూడ ఓసీపీని పరిశీలిస్తున్న పిపి జీఎం దేవేందర్, ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి

## ఆర్టీసీ డ్రైవర్‌పై పెట్టిన అక్రమ కేసుకు నిరసనగా ధర్నా

**ఆసిఫాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

ఆర్టీసీ డ్రైవర్‌పై పెట్టిన అక్రమ కేసుకు నిరసనగా ఆర్టీసీ డిపో గేట్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్టీసీ గేట్ వద్ద ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి దివాకర్ గౌడ్ మాట్లాడుతూ రెబ్బెన మండలంలోని దేవులగూడా వద్ద ఆర్టీసీ బస్సుకు వెనుక నుండి బులెరో వాహనం ఢీకొని జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి జైలుకు పంపించడం బాధాకరమని అన్నారు. ఈ విషయంలో డిపో మేనేజర్ నిరక్ష్యంగా వ్యవహరించడం సబబు కాదని ఆరోపించారు. ఆర్టీసీ డ్రైవర్ రామారావుకు వెంటనే బెయిల్ మంజూరు చేసి కేసు విషయంలో పునరాలోచన చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రఫిక్, తాహెర్, రాజు, హరినివాస్, బాలు, విలాస్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.



గేట్ ధర్నాలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

# ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

**ఆసిఫాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపిఐ వందో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏర్పడిన మొట్టమొదటి రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ(సీపిఐ) 1925 డిసెంబర్ 26న పుట్టి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ, ఎన్నో సమరాలు చేసిందని గుర్తుచేశారు. నాటి నుండి నేటి వరకు అమరవీరుల అరుణ రక్తపు ధార సాక్షిగా ఎరుపెక్కిన ఎర్ర జెండా వంద ఏళ్లుగా రెపరేపలాడుతూనే ఉందన్నారు. దున్నేవాడికి భూమి నినాదంతో లక్షలాది ఎకరాలు భూమిలేని పేదలకు భూ పంపిణి చేసిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం అశేష త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టులదని, పీడిత ప్రజల కోసం వెలలేని త్యాగాలు చేసిందని, బ్యాంకులను జాతీయం చేయడంలో ప్రధాన పాత్ర పోషించిందని వివరించారు. ప్రభుత్వ సంస్థల ఏర్పాటులో అగ్రగామిగా నిలిచి నేడు సిపిఐ 100వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి దివాకర్ గౌడ్, సిపిఐ జిల్లా నాయకులు పిడుగు శంకర్, సిపిఐ మండల కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు లేని పోరాటాలు లేవు..

**- సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్**

**మందమర్రి, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 101వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్ జెండాను ఆవిష్కరించి పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ పార్టీ నేటివరకు అనేక ఉద్యమాలు, పోరాటాల ద్వారా కార్మికులు, కర్షకులు, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ చట్టసభల్లో అనేక ప్రజాపక్ష చట్టాలను సాధించిందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించి అనేక మంది వీరమరణాలు పొందారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, దాదాపు పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేసిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా సిపిఐ కీలక పాత్ర పోషించి రాష్ట్ర సాధనకు తోడ్పడిందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు, కార్మికులు, కర్షకుల హక్కుల కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ సిపిఐ అని ఆయన స్పష్టం చేశారు. సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చే జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న శతయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, మేధావులు, ప్రజాస్వామ్య వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జాడి పోచం, దాడి గట్టయ్య, శాఖ కార్యదర్శులు దుర్గం సుధాకర్, పులి శంకర్, గంగాధరి రాజయ్య, దాగం రాజలింగు, రత్నం భీమన్న, గోనె సత్యం, గోదారుల లింగమూర్తి, దుర్గం పోశం, సోమగూడెంలో జెండా ఆవిష్కరించిన సీనియర్ కామ్రేడ్ జూపాక కొమురయ్య, ఎస్. నాగేశ్వరరావు, సందీప్ కుమార్, ఈ. సుందరం, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల పోరాటాల చరిత్ర సిపిఐ ఘనత..

**- పార్టీ రాష్ట్ర నాయకులు కలవేన శంకర్**

నస్పూర్ మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్

ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ బస్టాండ్, కటిక దుకాణాలు, షిర్కె సెంటర్, కృష్ణ కాలనీ తదితర ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ, వందేళ్లుగా పేదలు, కార్మికులు, రైతుల పక్షాన నిరంతరం పోరాడుతోందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో వేలాది మంది వీరులు ప్రాణత్యాగం చేసిన ఘన చరిత్ర పార్టీకి ఉందని వారు గుర్తుచేశారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ



జెండాను ఆవిష్కరిస్తున్న సీపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్

కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, పట్టణ కార్యదర్శులు పూజారి రామన్న, మిరియాల రాజేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా సమితి సభ్యులు దొడ్డిపట్ల రవీందర్, బీసీ సాధన సమితి మండల కార్యదర్శి జోగుల ఆంజనేయులు, కోడి వెంకటేశం, కంచె పోశం, కొత్తపల్లి మహేష్, బొడ్డు లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే సిపిఐ పార్టీ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి..

**రామకృష్ణాపూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే సిపిఐ పార్టీ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రామకృష్ణాపూర్ సిపిఐ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న సిపిఐ పార్టీ కాన్పూర్‌లో ఆవిరవించినప్పటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి చట్టసభల్లో కార్మికుల, కర్షకుల, విద్యార్థులకు అనేక చట్టాలు చేసిన ఘనత సిపిఐ పార్టీకి ఉన్నదన్నారు. దేశ స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటలు నిర్వహించి అనేకమంది కమ్యూనిస్టులు వీరమరణం పొందారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు



జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ

వ్యతిరేకంగా పోరాటలు నిర్వహించి పదివేల గ్రామాలను విముక్తి చేసి లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచి ఇచ్చినట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సిపిఐ పార్టీ కీలకపాత్ర పోషించి, ప్రత్యేక తెలంగాణ సాధించడంలో సిపిఐ పార్టీ కీలక పాత్ర వహించినదని అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం వారి హక్కుల కోసం నిరంతరం ప్రజల పక్షాన కార్మికుల కర్షకుల పక్షాన పోరాటలు చేస్తున్న పార్టీ సిపిఐ అని అన్నారు. సిపిఐ పార్టీకి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చే నెల 18న ఖమ్మంలో నిర్వహించే శతయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే, బహిరంగ సభలో కమ్యూనిస్టు నాయకులు కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులు సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య జిల్లా సమితి సభ్యులు మామిడి, గోపి, వనం సత్యనారాయణ, నక్క వేంకటస్వామి, మిట్టపల్లి పౌలు, సిపిఐ నాయకులు మెరుగు రాజేశం, కుక్క దేవానంద్, పోటర్ల రాములు, కారుకూరి రాయలింగ్ ముతూకుల రాజన్న, కౌడగాని సాంబయ్య, బోయపోతుల కొమురయ్య, గోవిందుల రమేష్, అక్కల శంకర్, మాదాసు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి పట్టణ సిపిఐ కార్యాలయంలో అరుణ పతాక ఆవిష్కరణ..

**బెల్లంపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా బెల్లంపల్లి పట్నంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం (బాసెట్టి గంగారం విజ్ఞాన్ భవన్) లో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా పట్టణ పార్టీ కార్యదర్శి ఆడెపు రాజమోళి పతాక ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేసి అనంతరం మాట్లాడుతూ ఈ దేశంలో 1925 సంవత్సరం డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ లోని కాన్పూర్ లో ఎంఎన్ రాయ్, ఏ వల్లన్ రాయ్, అబాని ముఖర్జీ, రోసాపిటం గోన్, మహమ్మద్ అలీ, మహమ్మద్ షఫిక్ నాయకత్వంలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించబడినది. జనరల్ సెక్రెటరీగా ఎస్వి గాటే ఎన్నికైనారు. ఈ దేశ స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించినది. అనేక ప్రజా పోరాటాలు నిర్వహించినది ఈ తెలంగాణలో నైజాముకు వ్యతిరేకంగా దొరల దోపిడీకి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దున్నే వాడికి భూమి చెందాలని , కార్మిక చట్టాల గురించి, పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి అనేకమైన పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉన్నది. కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అలాగే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను బడా పారిశ్రామికవేత్తలకు దారా దత్తం చేస్తూ సంపన్నులను ఇంకా సంపన్నులను చేస్తూ పేదలను నిరుపేదలుగా మారుస్తూ ప్రజా కంటక ప్రభుత్వంగా తయారయింది. ఈ పాసిస్తూ బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతర ప్రజా పోరాటాలు చేయవలసి ఉన్నది. నేటికీ 100 సంవత్సరాలు అవుతున్నందున దేశమంతా ఈ ఉత్సవాలు జరుపబడుచున్నవి. ఈ కార్యక్రమంలో పట్టణ సహకార దర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, మండల కార్యదర్శి బొందల లక్ష్మీనారాయణ, బికేయంయు జాతీయ సమితి సభ్యులు అక్కపెల్లి బాబు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు బొల్లం సోని, జిల్లా సమితి సభ్యులు రత్నంరాజం, నాయకులు బొంకూర్ రామచందర్, బండారి శంకర్, సమ్మయ్య, మహేందర్ రెడ్డి, తిరుపతి, శంకర్ గౌడ్, ఇనుముల రాయ మల్లు, కలువల రాయమల్లు, శని గారపు జక్కయ్య, స్వామిదాస్, అందుగుల రాజేందర్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# పాలవాగు సమ్మక్క-సారక్క జాతరకు వైభవ ఏర్పాట్లు

## జాతరను ఘనంగా నిర్వహించాలి: జీఎం పిలుపు

మందమర్రి, డిసెంబర్ 26, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని పాలవాగు ఒడ్డు అటవీ ప్రాంతంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే సమ్మక్క సారక్క జాతరను వైభవంగా నిర్వహించడానికి గుర్తింపు సంఘం నాయకులు, అన్ని డిపార్టుమెంట్ల అధికారులు కృషి చేయాలని మందమర్రి జీ.ఎం రాధాకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి జీఎం కార్యాలయంలో జాతర ఏర్పాట్లకు సంబంధించి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి నుంచే జాతర వద్ద చేయాల్సిన పనుల గురించి అధికారులు సమీక్షించుకోవాలన్నారు. సమ్మక్క సారక్క గద్దెల వద్ద చేపట్టాల్సిన పనుల గురించి చర్చించుకోవా లన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, మంచి నీటి వసతులతో పాటు, విద్యుత్ దీపాల ఏర్పాట్లపై కూడ దృష్టి పెట్టాలన్నారు. భక్తులు వెళ్లేందుకు వీలుగా తాత్కాలిక రోడ్లను కూడ ఏర్పాటు చేయాలన్నారు. మేడారం జాతరను తలపించే విధంగా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. యూనియన్ ప్రతినిధులు కూడా తమ యొక్క సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, డీజీఎం ఈ అండ్ ఎం వర్క్ షాప్ దూప్ సింగ్, ఇన్చార్జి పర్సనల్ మేనేజర్ ఎం.డి ఆసిఫ్, సివిల్ ఎస్ ఇ శ్రీధర్, ఏరియా సర్వే ఆఫీసర్ దేశాయ్, ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, ఏఐటియుసి వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, ఏఐటియుసి జీఎం స్ట్రక్చర్ కమిటీ మీటింగ్ మెంబర్ సి.వి రమణ, మందమర్రి ఏరియా ఉన్నతాధికారులు, అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

బెల్లంపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త

బెల్లంపల్లి మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంసి క్రికెట్ మైదానంలో శుక్రవారం నాడు ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంటును బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు పెడమార్గంలో పయనించకుండా ఉండడానికి ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు అవసరమన్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని సాధించి పేరు సంపాదించాలన్నారు. ఈ లీగ్ టోర్నమెంట్ను మూడు విభాగాలుగా ఏజిసి పేరుతో విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య, సీనియర్ క్రికెటర్ ఈగ వెంకటస్వామి, అకాడమీ ఇన్చార్జ్ అల్లం వెంకటేశ్వర్లు, కోచ్ జాడి శేఖర్, సీనియర్ క్రికెటర్లు బూదె సత్తి, గీస రాములు, జి శ్రీనివాస్ చారి, అల్లం గౌతం పిఎటి హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసి సర్పంచులు, ఉపసర్పంచులకు సన్మానం

బెజ్జూర్,డిసెంబర్ 26,ప్రభాతవార్త :



సన్మానం అందుకున్న సర్పంచులు, ఉప సర్పంచులు

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆదివాసి సంఘ భవనంలో శుక్రవారం మండలంలోని ఆదివాసి సర్పంచులు,ఉప సర్పంచులకు మండలంలోని ఉద్యోగ,ఉపాధ్యాయ, ఆదివాసి సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలవేసి అలంకరించిన అనంతరం మండలంలోని 11 మంది సర్పంచులు,10 మంది ఉపసర్పంచులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల భాగస్వామ్యం,ప్రభుత్వ సహకారంతో తమ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని నూతన ప్రజా ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి ఉద్యోగ,ఉపాధ్యాయులు రమేష్, వెంకటేష్,రామయ్య,వెంకట్రావ్,హరి ప్రసాద్,ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు కోరెటె తిరుపతి,తాజా మాజీ జెడ్పిటిసి పంద్రం పుష్పలత,వీటీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఒం ప్రకాష్,కొలవార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం బక్కయ్య,జిల్లా సమఖ్య గౌరవ అధ్యక్షురాలు శ్రీదేవి, ఆదివాసి సంఘం నాయకులు పాల్గొన్నారు.



గ్రామ పెద్దలతో కలిసి ఎన్టీపిపి అధికారులతో మాట్లాడుతున్న పెగడపల్లి సర్పంచ్

# పెగడపల్లి గ్రామ అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం సహకరించాలి

జైపూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త

పెగడపల్లి గ్రామ అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం సహకరించాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రామగిరి రామన్న కోరారు. శుక్రవారం జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ ఈడి చిరంజీవితో పాటు ఇతర ఉన్నత అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. గ్రామ అభివృద్ధి,నిరుద్యోగ సమస్యల పైన మాట్లాడగా,అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్య పరిష్కారానికి పాటుపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎస్టిపిపి అధికారులు పాల్గొన్నారు.


# సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఏరియా ఎస్టి లైజన్ ఆఫీసర్‌గా దేవేందర్ సింగ్

జైపూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నూతన ఎస్టి లైజన్ ఆఫీసర్‌గా ఈ.ఈ దేవేందర్ సింగ్‌ను నియమిస్తూ కార్పోరేట్ (పర్సనల్) (ఐఆర్ అండ్ పిఎం) జిఎం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈడి చిరంజీవి చేతుల మీదుగా ఈ నియామక పత్రాన్ని దేవేందర్ సింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులు ఎస్టిపిపి ఉద్యోగులు దేవేందర్ సింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటి సభ్యుడు దేవేందర్ సింగ్ మాట్లాడుతూ తనను ఎంపిక చేసిన సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ ప్రెసిడెంట్ పంతులా, సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ ప్రెసిడెంట్ పంతులా, ఎస్టి బ్రాంచ్ అధ్యక్షులు తిరుమల్, ఎస్.ఓ.టు ఈడి వెంకటయ్య, బిసి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేవి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.



దేవేందర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎస్టిపిపి ఈడి చిరంజీవి



దర్శనానంతరం ఎమ్మెల్యే దంపతులు

# శబరిమల క్షేత్రంలో అయ్యప్పను దర్శించుకున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :

శబరిమలకు బయలుదేరిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు అయ్యప్పను దర్శనం చేసుకున్నారు. శుక్రవారం శబరిమల క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే నిష్ఠతో ఇరుముడి కట్టుకుని కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే తన బృందం స్వాములతో కలిసి పదునెట్టాంబడి (18 మెట్లు) ఎక్కి మణికంఠుడిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో స్వాములు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



గొర్రెకు నట్టల నివారణ మందు వేస్తున్న డాక్టర్ నరసింహారావు

# గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయించుకోవాలి

తాండూర్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :

మండలంలోని బోయపల్లి గ్రామంలో శుక్రవారం గొర్రెలకు, మేకలకు,ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా తాండూర్ పశువైద్యశాల డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు యజమానులు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో తాండూర్ మండల పశు వైద్యులు డాక్టర్ నరసింహారావ్, సర్పంచ్ సుందిల్ల శంకరమ్మ, యాదవ సంఘం నాయకులు మల్లేష్, కొమ్మ మొండి, పశు వైద్య సిబ్బంది అన్నం మల్లేష్, దుర్గం కళ్యాణ్, పాల్గొన్నారు.

# నట్టల నివారణకు మందులు పంపిణీ చేసిన పశు వైద్య సిబ్బంది

లక్షెట్టిపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త

మండలంలోని అంకత్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గొర్రెలకు, మేకలకు నట్టల మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ లింగంపల్లి లతా వెంకటేష్, కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ... ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ మందులను గొర్రెల, మేకల, యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలు గొర్రెలకు, మేకలకు మందులు వేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోచ కుమార్, పశు వైద్య అధికారి భూమయ్య, సిబ్బంది, గ్రామ అధ్యక్షులు చందు యాదవ్, మాజీ వార్డు సభ్యులు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

